క్లుప్తంగా

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం



ముగతిలో వైద్య సేవలందిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రకాంత్ యాదవ్

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రకాంత్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలపరిధిలోని ముగతి గ్రామంలో సచివాలయం–2 పరిధిలో గ్రామంలోని మహిళలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పల్లెల్లో పేదలకు ఉచితంగా పటిష్టమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. షుగర్, బీపీ, ఉబ్బసం వంటి దీర్ఘకాలికవ్యాధిగ్రస్తులకు ఇంటివద్దకే వెళ్లి వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నట్లువివరించారు.గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించామన్నారు.హెల్త్‌సిబ్బంది,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలూరు సచివాలయం–3 పరిధిలో మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 104 వాహనాలతో ఇంటింటికీ వెళ్లి వైద్యం అందిస్తున్నామన్నారు. దీర్ఘకాలిక రోగులకు, వృద్ధులు, వికలాంగులు, బాలింతలు, గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్నామని తెలిపారు. సోమవారం పట్టణంలోని సిద్దేశ్వర కాలనీలో 118 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు.

బడి తెరచిన రోజునే విద్యాకానుక పంపిణీ

మద్దికెర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు జూన్ 12వ తేదీన పాఠశాలల పునఃప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక అందించడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి రంగస్వామి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జగనన్న విద్యా కానుకను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూలు ప్రారంభమయ్యే నాటికి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కిట్లను అందజేస్తామన్నారు. అలాగే అమ్మ ఒడి పథకానికి సంబంధించి జూన్ 13వ తేదీన విద్యార్థుల జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు.

కళాకారులను గౌరవిద్దాం

మద్దికెర: సాంప్రదాయాలను గౌరవిస్తూ, గ్రామీణ సంస్కృతుల పరిరక్షణే ధ్యేయంగా కళలను ప్రదర్శిస్తున్న కళాకారులను గౌరవించాలని మాజీ సర్పంచ్ లోకిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని హంప గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా చెక్క భజన, భజనలు చేసిన కళాకారులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో పూర్వం నుంచి వస్తున్న చెక్క భజనలు తదితర కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా గ్రామాల్లోని ప్రజలు ఐక్యతతో మెలుగుతారన్నారు. నాయకులు నారాయణ, రియాజ్, హంపన్న, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఆస్పరి: మండలంలో ఈనెల 16వ తేదీన ములుగుదం, 17న నగరూరు గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య సోమవారం తెలిపారు. కార్యక్రమానికి మంత్రి గుమ్మనూరు జయరాం హాజరవుతారని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారన్నారు. అలాగే ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. ప్రభుత్వ అధికారులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రైతు భరోసా దరఖాస్తుకు 18 వరకు గడువు

మద్దికెర: 2023–24 సంవత్సరానికి సంబంధించి వైఎస్సార్ రైతు భరోసా పథకానికి ఈ నెల 18వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఏఓ హేమలత సోమవారం తెలిపారు. అర్హత ఉండి పథకం లబ్ధిపొందని వారు, ఇంతవరకు దరఖాస్తు చేసుకోని వారు ఉంటే ఈనెల 18వ తేదీ లోపల స్థానిక రైతు భరోసా కేంద్రంలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు అందించి ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

తుగ్గలి: మండల పరిధిలోని మిద్దెతండాలో నెల కొన్న తాగునీటి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. సర్పంచ్ బనావత్ లక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నారాయణనాయక్ నీటి సమస్యను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసు కెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే బోరు వేయించారు. రెండు ఇంచులకు పైగా నీళ్లు పడ్డాయని సర్పంచ్ లక్ష్మి, నారాయణనాయక్ తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లమ్మ గుట్టతండ సర్పంచ్ గౌరవ సలహాదారు బాబు నాయక్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ కృష్ణానాయక్ పాల్గొన్నారు.

ఆటలమ్మను నివారిద్దాం

- వేసవిలో వ్యాపిస్తున్న వైరస్
- చిన్నపిల్లల్లో అధికం
- నాటు వైద్యానికి దూరముంటే మేలు

హొళగుంద: వేసవిలో చిన్నపిల్లలకు ప్రధానంగా ఆటలమ్మగా పిలిచే తట్టు వ్యాధి ఎక్కువగా సోకుతుంది. దీన్ని అమ్మోరు.. చికెన్‌పాక్స్.. ఆటలమ్మ.. తట్టు పేర్లతో కూడా పిలుస్తారు. వేసవిలో చిన్న పిల్లల్లో శరీరంలో ఉష్ణోగ్రత పెరగడం వల్ల ఒక రకమైన వైరస్ కారణంగా ఈ వ్యాధి సోకుతుంది. సాధారణంగా 2–12 ఏళ్ల వయసున్న పిల్లలకు ఈ వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. పెద్దలకు అరుదుగా వస్తుంది. ఎలాంటి హాని కలిగించని ఈ వ్యాధి ఐదారు రోజులకు దానంతటదే తగ్గిపోతుంది. నూటిలో ఒకరిద్దరికి కొద్దిగా ప్రభావం చూపుతుంది తప్పా ప్రమాదకరమైన వ్యాధి కాదు. వ్యాధి సోకిన సమయంలో కొన్ని జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది.

ఆటలమ్మ వ్యాధి ఎలా సోకుతుంది, దాని లక్షణాలు

ప్రధానంగా రెండేళ్లపై బడిన పిల్లలకు ఈ వ్యాధి సోకుతుంది. శరీరంపై నీటి పొక్కులు, ఎర్రటి గుల్లలు వస్తాయి. అంతకు ముందు కళ్లలో నీరు కారడం, నలుసు రావడం జరుగుతుంది. శరీరంపై లేచిన గుల్లలు మంట, దురదగా ఉంటాయి. జ్వరం, ఆకలి మందగించడం, దగ్గు దీని లక్షణాలు. చిన్నగా మొదలై శరీరం మొత్తం గుల్లలు, దద్దర్లు లేస్తాయి. ఇంట్లో ఒకరి నుంచి మరొకరికి వ్యాధి వ్యాపిస్తుంది.

వ్యాధి ప్రభావం–తీసుకోవలసిన జాగ్రత్తలు

వ్యాధి సోకినప్పుడు కొద్ది రోజులు పిల్లలు సరిగా ఆహారం తీసుకోలేరు. రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. పిల్లలు నీరసంగా ఉంటారు. వీరికి మెత్తని ద్రవ పదార్థాన్ని ఇవ్వాలి. కొబ్బరినీళ్లు, మజ్జిగ తాగించాలి. శరీరంపై నీరు, చీము గుల్లలు, ర్యాష్‌ల వల్ల కలిగే మంట నుంచి ఉపశమనం కలిగించడానికి గోరువెచ్చని నీటితో తుడుస్తూ ఉండాలి. వీరికి ప్రత్యేకంగా గది, దుస్తులు, బెడ్, సబ్బు ఉంచాలి. బయట గాలికి తిరగరాదు. ఐదారు రోజులు ఇలాగే చేస్తుంటే గుల్లలు తగ్గిపోతాయి. పత్యం ఉండాల్సిన అవసరం లేదు. 15 రోజులు దాటి అలాగే ఉంటే వెంటనే పిల్లలను పిడియాట్రిక్, గర్భిణులను గైనకలాజిస్ట్‌ల వద్ద చూపించడం మంచిది. వ్యాధి ఉన్న కొద్ది రోజులు జ్వరం తగ్గడానికి, మచ్చలు పోవడానికి మందులు వాడాల్సి ఉంటుంది. ఆర్‌ఎంపీలు, అనుభవం లేని వైద్యుల వద్ద చికిత్స చేయించరాదు.

ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్

చికెన్‌పాక్స్ వ్యాధి రాకుండా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. అయితే సరఫరా లేకపోవడంతో పీహెచ్‌సీలలో వ్యాక్సిన్లు వేయడం లేదు. దానికి బదులుగా మ్యూజ్‌వల్స్ వేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో, హెల్త్ సబ్ సెంటర్‌లో కూడా వేయాల్సి ఉంది. 12–18 నెలల పిల్లలకు మొదటి విడత, 4–6 ఏళ్ల వారికి రెండో విడత తట్టు నివారణ వ్యాక్సిన్ (వరివాక్స్)లు వేయాలి. దీంతో 90 శాతం మందికి చికెన్‌పాక్స్ రాదు. వ్యాక్సిన్ వేయించుకున్న వారు వ్యాధి వచ్చిన వారి నుంచి దూరంగా ఉండాలి.

పసరు తాగించడం మంచిది కాదు

గ్రామీణ ప్రాంతల్లో చికెన్‌పాక్స్‌ను తట్టుగా పిలుస్తారు. ఈ వ్యాధి నయం అయ్యేంత వరకు పాత సాంప్రదాయాన్ని పాటిస్తుంటారు. వ్యాధి సోకిన పిల్లలకు పల్లెల్లో వేపాకుల నీటితో స్నానం చేయించడం, పసరు తాగించడం జరుగుతుంది. పసరు తాగించడం మినహాయించి వేపాకు నీళ్లతో స్నానం చేయించడం, శరీరంపై వేపాకులు కప్పడం మంచిదే. యాంటీబయాటిక్ మాదిరిగా పనిచేస్తూ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఆయుర్వేద వైద్యుడిని సంప్రదించి ఇలాంటివి చేయాలి. ప్రమాదకర వ్యాధి కాకపోవడంతో భయపడాల్సిన అవసరం లేదు. చిన్న పిల్లలు కావడం వల్ల వ్యాధి వచ్చిన ఆ కొద్ది రోజులు జాగ్రత్తలు పాటిస్తే చాలు. ఆలూరు నియోజకవర్గంలోని హొళగుంద, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, దేవనకొండ మండలాల్లో ఈ వ్యాధి తీవ్రత ఉంది. అయితే ఆరోగ్య కేంద్రాలలో తక్కువగా కేసులు నమోదు అవుతుంటే అనధికారికంగా ఇళ్లలోనే వ్యాధి తగ్గించుకుంటున్నారు. వ్యాధి సోకిన పిల్లలను ఇళ్ల వద్ద ఉంచి అనాదిగా చేసుకొస్తున్న సాంప్రదాయాలను పాటిస్తున్నారు. డాక్టర్ల వద్దకు తీసుకెళ్లడాన్ని ఇక్కడి ప్రజలు అరిష్టంగా భావిస్తారు. దీనివల్ల వ్యాధిగ్రస్తుల సంఖ్య తేలడం లేదు.



శరీరంపై ఆటలమ్మ పొక్కులు

ప్రాణాంతకం కాదు



చికెన్‌పాక్స్ ప్రాణాంతక వ్యాధి కాదు. వ్యాధి లక్షణాలను బట్టి మందులు ఇస్తే తగ్గిపోతుంది. కొద్ది రోజులుండి పోయే ఈ వ్యాధి అరుదుగా బ్యాక్టీరియల్ వైరల్‌గా మారుతుంది. అటువంటి సమయంలో వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సలహాలను పాటిస్తే ఏ ఇబ్బంది ఉండదు. నాటు వైద్యాన్ని సంప్రదించడం, పసరు తాగించడం మంచిది కాదు.

– న్యూటన్, వైద్యాధికారి, హొళగుంద పీహెచ్‌సీ

అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనొద్దు

హొళగుంద: సరైన అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్‌లలో నిర్మించుకున్న ఇళ్లకు పంచాయతీ ఆధ్వర్యంలో సదుపాయాలు కల్పించబోమని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ స్పష్టం చేశారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. హొళగుంద శివారులో కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పంచాయతీ అనుమతులు లేకుండా, ప్రభుత్వానికి ఫీజు చెల్లించకుండా నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి లేఅవుట్లలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, కొళాయిలు ఇతర మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టబోమన్నారు. అక్రమ లే అవుట్లలో ఎవరూ ప్లాట్లు కొనవద్దని సూచించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమాలపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమయపాలన పాటించండి

కృష్ణగిరి: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ మోహన్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. చాలా సచివాలయాల్లో ఉదయం 11 గంటలకు ఉద్యోగులు వస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇప్పటికే చాలా మందికి మోమోలు ఇవ్వడం జరిగిందన్నారు. మార్పు రాకపోతే చార్జ్ మోమో ఇస్తామన్నారు. కార్యదర్శులు బాధ్యత తీసుకుని ఉద్యోగులందరూ సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



హోసూరులో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: కులమత వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని హోసూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు సర్పంచ్ నాగప్ప ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా వీరభద్ర స్వామి దేవాలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గడప గడపకు వెళ్లి నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. సీఎం జగనన్న పాలనలో నవరత్నాల పథకాలతో అందరికీ లబ్ధి చేకూరిందన్నారు. ఎలాంటి వివక్షకు తావు లేకుండా ప్రతిపక్షాలకు చెందిన వారికి సైతం పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నను మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, మోహన్, శ్రీనివాసులు, ఎంపీటీసీలు కేశప్ప, నెట్టికళ్లు, నాయకులు శాంతిరెడ్డి, నాగిరెడ్డి, ఎంపీడీఓ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పేరుతో టీడీపీ భూదందా



యువతి వివాహానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టీడీపీ నాయకులు అమరావతి రాజధాని పేరుతో రైతులు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారి భూములను అడ్డంగా దోచుకున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆరోపించారు. స్థానిక మంత్రి నివాసంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాజధాని పేరిట ఇష్టానుసారంగా రైతుల నుంచి భూములను లాక్కొని రియల్ దోపిడికి తెరతీశారన్నారు. బినామీల పేరిట వందల ఎకరాలను స్వాహా చేసి కోట్లాది రూపాయాల అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. రాజధాని డిజైన్ మార్చి సినిమా గ్రాఫిక్స్ పేరుతో ప్రజలు, రైతులను మోసగించారన్నారు. పేద ప్రజలను పట్టించుకోకుండా ప్రశ్నించిన అధికారులపై భౌతిక దాడులకు పాల్పడి గాయపరచారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మానప్రాణాలను కాపాడుకునేందుకు గ్రామాలు వదిలి వెళ్లిన వారు ఎంతో మంది ఉన్నారని వివరించారు. రాష్ట్ర ప్రజలు తిరస్కరించిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చంకన చేరి భజన చేస్తున్న సంఘటనలను ప్రజలు గమనిస్తున్నారని మంత్రి గుర్తు చేశారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

హాలహర్వి మండలం బాపురం గ్రామానికి చెందిన మస్తాన్, గంగమ్మ దంపతుల కుమార్తె సుజాత వివాహానికి మంత్రి గుమ్మనూరు జయరాం ఆర్థిక సాయం అందించారు. సోమవారం యువతి కుటుంబసభ్యులు మంత్రి నివాసంలో ఆయన్ను కలిసి వివాహ వేడుకలకు హాజరు కావాల్సిందిగా కోరుతూ ఆహ్వానపత్రిక అందించారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం రూ.10 వేలు నగదు, బియ్యం, నూనె, వస్త్రాలను మనుమడు ఇషాన్ చేతుల మీదుగా వారికి అందజేశారు. వారు మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు



ఎమ్మిగనూరు 15వ వార్డులో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రజల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పథకాలను రూపొందించి ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు నింపుతున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 15వ వార్డులో కౌన్సిలర్ ఇషాక్, మున్సిపల్ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లు అందజేశారు. ఇచ్చిన హామీల మేరకు వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు వర్తింపజేసినట్లు తెలిపారు. పట్టణంలో మంచినీటి సమస్య పరిష్కరించేందుకు ఐఏటీ స్కీం కింద రూ.142 కోట్లతో జీడీపీ నుంచి మంచినీటిని పంపింగ్ చేసేందుకు పనులు వేగవంతం చేసేలా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. వార్డు పరిధిలో సీసీ రోడ్లు, యూజీడీ సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకురావడంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డీఈ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక ఎడ్ల పందేలు



పగిడిరాయిలో ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జగన్నాథరెడ్డి

తుగ్గలి: సంస్కృతి సంప్రదాయాలకు ఎద్దుల రాతి దూలంలాగుడు పోటీలు ప్రతీక అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథరెడ్డి, ఎంపీపీ ఆదెమ్మ, సర్పంచ్ సౌజన్య అన్నారు. అభయాంజనేయస్వామి తిరునాల సందర్భంగా సోమవారం పగిడిరాయిలో ఏర్పాటు చేసిన వృషభాల రాతి దూలం లాగుడు పోటీలను వారు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే రాతి దూలం లాగుడు పోటీలు ప్రతి ఒక్కరికీ ఉత్సాహాన్నిస్తాయన్నారు. దేవుడి దయతో ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. పోటీలలో పది జత ఎద్దులు పాల్గొనగా అనంతపురం జిల్లా చాబాల కుల్లాయప్ప ఎద్దులు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో ఆత్మకూరు కడియాల మహిత్ రంగారెడ్డి ఎద్దులు, గడేకల్లు బుట్టా బీమశంకర్ ఎద్దులు, ఆత్మకూరు పోలన్న ఎద్దులు, చెట్నేపల్లి మల్లికార్జున ఎద్దులు, రామరాజుపల్లి ఏకాశి చెన్నారెడ్డి ఎద్దులు నిలిచాయి. విజేతలైన ఎద్దుల యజమానులకు వరుసగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథరెడ్డి రూ.25 వేలు, ఎంపీపీ ఆదెమ్మ రంగన్న దంపతులు రూ.20 వేలు, సర్పంచ్ సౌజన్య, గౌరవ సలహాదారు హనుమంతు రూ.15 వేలు, కాయల రంగయ్య రూ.10 వేలు, ఇసురాళ్ల లాలుస్వామి రూ.7,016, వడ్ల ఆచారి రూ.5,016 నగదు బహుమతులను అందజేశారు.

జలకళ మోటార్ల పంపిణీ



శభాష్‌పురం మహిళా రైతు వెంకటేశ్వరమ్మకు బోరు మోటారు సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

తుగ్గలి: వైఎస్సార్ జలకళ పథకంలో బోర్లు వేసుకున్న రైతులకు ఉచితంగా విద్యుతు మోటారు సామగ్రిని సోమవారం డ్వామా సీనియర్ క్వాలిటీ అధికారి మల్లికార్జున అందజేశారు. శభాష్‌పురం, రాంపల్లి, కడమకుంట్ల, రాతనకు చెందిన రైతులు వెంకటేశ్వరమ్మ, జూటూరు రాజు,కొండా వెంకటేష్, రంగమ్మలకు బోరు మోటారు, విద్యుత్ వైరు, స్టార్టర్, పైపులు తదితర సామగ్రిని అందజేశారు. అర్హులైన రైతుల పొలాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే ఉచితంగా జలకళ పథకం కింద బోర్లు వేసినట్లు చెప్పారు. ప్రస్తుతం బోరు మోటారు సామాగ్రి కూడా అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు. జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సాయి కిషోర్, ఈసీ ప్రదీప్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు సందీప్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

మోటారు, పంపుసెట్టు పంపిణీ

మద్దికెర: జలకళ పథకంలో భాగంగా పొలాలలో బోరు వేయడమే గాకుండా మోటారు, పంపుసెట్టు, వైర్లు తదితర సామగ్రి అందజేసినట్లు రైతు గోవిందు సోమవారం తెలిపారు. బురుజుల గ్రామానికి చెందిన రైతు గోవిందు మాట్లాడుతూ.. ఉచితంగా బోరు వేయడంతో పాటు సామగ్రి అందించి విద్యుత్ సౌకర్యం కల్పించడంపై సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. బోరు సామగ్రిని సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు మల్లికార్జున, సాయినాథ్, ఏపీడీ పద్మావతి అందజేసినట్లు చెప్పారు.

కోలుకోలేక వివాహిత మృతి



మృతిచెందిన చాకలి కృష్ణవేణి

గోనెగండ్ల: మండల పరిధిలోని కులుమాల గ్రామానికి చెందిన చాకలి కృష్ణవేణి(32) కోలుకోలేక సోమవారం ఉదయం మృతిచెందినట్లు ఏఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి మల్లేష్, కృష్ణవేణి దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నాడు. వీరు గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత ఐదేళ్లుగా కృష్ణవేణి కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రులలో చూపించుకున్నా కడుపునొప్పి తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 13వ తేదీన రాత్రి పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం ఉదయం మృతిచెందినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతురాలి భర్త మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెల్లడించారు.

ప్రజా సేవే లక్ష్యం



మాట్లాడుతున్న హిమవర్షా రెడ్డి

దేవనకొండ: అమ్మ, నాన్న ప్రజలు, కార్యకర్తలకు అందించిన సేవలను తిరిగి తాను కొనసాగిస్తానని దివంగత మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజారెడ్డి కుమార్తె హిమవర్షా రెడ్డి తెలిపారు. దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామంలో ఆమె సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గం నుంచి మా అమ్మ పాటిల్ నీరజారెడ్డి, నాన్న పత్తికొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలుగా పోటీ చేసి గెలుపొంది ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. వారి బాటలోనే తనవంతుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో పనిచేస్తానన్నారు.

రేబిస్ వ్యాధి ప్రాణాంతకం

మద్దికెర: రేబిస్ అనే వ్యాధి ప్రాణాంతకమైనదని ఆ వైరస్ ఉన్న కుక్కలు జంతువులను గానీ, మనుషులను గానీ కరిస్తే వ్యాధి వస్తుందని పశు వైద్యాధికారి కృష్ణనాయక్ అన్నారు. రేబిస్ వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా సోమవారం స్థానిక పశు వైద్యశాలలో కుక్కలకు యాంటీ రేబిస్ టీకాల కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంపుడు కుక్కలతో పాటు వీధి కుక్కలకు ఉచితంగా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. జంతు ప్రేమికులు కుక్కల నుంచి ఈ వ్యాధి సోకకుండా టీకాలు వేయించడానికి ముందుకు రావాలన్నారు. ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

‘స్పందన’ అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన మండలాధికారులు

నందవరం: స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయరాదని ఎంపీడీఓ కృష్ణమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ రఘువీర, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సృజన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలాధికారులు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్పందనలో ప్రజలు సమర్పించిన అర్జీలు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మండలంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. మన బడి నాడు– నేడు పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని పీఆర్ ఏఈకి సూచించారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, ఎంఈఓ సుదర్శన్ రెడ్డి, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, ఏఓ మర్రి స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీల పట్ల సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పురుషోత్తం ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో వివిధ గ్రామాల ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. అర్జీలను శాఖల వారీగా అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పట్ల వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు మూడు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామస్థాయిలోనే పరిష్కరిస్తే సమస్యలు ఉండవన్నారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఈఏపీ సెట్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరన్న మాట్లాడుతూ.. 19వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మొదటిరోజు 320 మందికి అలాట్ చేయగా 306 మంది పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. పరీక్ష సమయం కంటే ముందుగానే విద్యార్థులు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

కౌలు రైతులు దరఖాస్తు చేసుకోండి

కృష్ణగిరి: సొంత పొలం లేకుండా, కేవలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసే రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌలు రైతుల గుర్తింపు కోసం ఈ నెల 11 నుంచి 23వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మంగళవారం కోయిలకొండ, చిట్యాల గ్రామాల్లో సదస్సు ఉంటుందన్నారు. అర్హులైన రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి రైతు భరోసా కింద సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

వేధింపుల కేసు నమోదు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణానికి చెందిన జయన్న ఆచారిపై సోమవారం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వెల్దుర్తికి చెందిన బోయ సుశీలను 2010లో జయన్న ఆచారి రెండవ పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే కొన్ని రోజులుగా భార్య, పిల్లలను పట్టించుకోకుండా మద్యం తాగి వచ్చి శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నవోదయ ప్రిన్సిపాల్‌కు పదోన్నతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ కె.సాగరిక బీహర్ రాష్ట్రం పాట్నా సమితి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతిపై వెళ్లినట్లు ఇన్‌చార్జ్ పిన్సిపాల్ కె.చందిరన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె బనవాసి నవోదయ ప్రిన్సిపాల్‌గా 2022 ఆగస్టు 14న బాధ్యతలు చేపట్టారని, బదిలీపై వెళుతూ తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

తెరచుకున్న ప్రధాన ద్వారం

సాక్షి ఎఫెక్ట్



సోమవారం హొళగుంద తహసీల్దార్ కార్యాలయ ప్రధాన ద్వారాన్ని తెరచిన దృశ్యం

హొళగుంద: వాస్తు బాగాలేదని మూడేళ్ల నుంచి హొళగుంద తహసీల్దార్ కార్యాలయ ప్రధాన ద్వారానికి వేసిన తాళం ఎట్టకేలకు సోమవారం తెరచుకుంది. రెండు ద్వారాలున్న కార్యాలయానికి అప్పటి డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ ఆధ్వర్యంలో వాస్తు పేరుతో ప్రధాన ద్వారానికి తాళం వేసి పక్కనున్న మరో వాకిలి నుంచి రాకపోకలు సాగించారు. దీనిపై గతంలో అనేక విమర్శలు వెల్లువెత్తాయి. తహసీల్దార్లు, ఇతర సిబ్బంది మారి ఏళ్లు గడుస్తున్నా దాన్ని అలాగే పాటిస్తూ ప్రధాన ద్వారం తాళం మాత్రం తెరువలేదు. దీనిపై ఆదివారం ‘సాక్షి’ దినపత్రికలో ‘తహసీల్దారు కార్యాలయానికి వాస్తు దోషం’ శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పదించిన తహసీల్దార్ హుసేన్‌సాహేబ్ సోమవారం ప్రధాన ద్వారానికి వేసిన తాళాన్ని తీసి ఇదే మార్గం గుండా రాకపోకలు జరిగేలా చర్యలు తీసుకున్నారు.